క్లుప్తంగా

దానిమ్మ చెట్లు ధ్వంసం


ధ్వంసమైన చెట్లను పరిశీలిస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం

యల్లనూరు: మండలంలోని తిమ్మంపల్లిలో గుర్తు తెలియని వ్యక్తులు దానిమ్మ చెట్లు ధ్వంసం చేశారు. వివరాలు.. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సర్పంచు సాయికుమార్ తండ్రి పోలేరప్పకు చెందిన రెండెకరాల వ్యవసాయ పొలం(సర్వే నెంబరు 605)లో రెండేళ్ల క్రితం 370 దానిమ్మ మొక్కలు సాగు చేశాడు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తోటలోకి ప్రవేశించి 20 చెట్ల కొమ్మలను తుంచేశారు. సమాచారం అందుకున్న పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం గ్రామానికి చేరుకుని చెట్లను పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ శ్రీనివాసగౌడ్ తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

గుంతకల్లు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చిన్నకొండయ్య, జే.నరసయ్య మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, జీపీఎఫ్ ఖాతాలను ప్రారంభించాలన్నారు. క్లాప్ ఆటోడ్రైవర్లకు రూ.18500 జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 21 నుంచి 27 వరకు రోజూ నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. నాయకులు చిన్న, వాసు, నాగరాజు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌బీమా తక్షణ సాయం అందజేత


నగదు అందిస్తున్న ఎంపీడీఓ నిర్మలాకుమారి

శింగనమల: మండల కేంద్రానికి చెందిన వడ్డె రమేష్ అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మృతి చెందాడు. వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద ఎంపీడీఓ నిర్మలాకుమారి గురువారం మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10 వేలు నగదు అందజేశారు. మిగిలిన రూ.90 వేల మొత్తం నామినీ బ్యాంకు ఖాతాలో పడుతుందని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత నవీన్‌కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేంద్ర, మహిళ పోలీస్ హరిత, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఆర్బీకే ఆకస్మిక తనిఖీ


రైతులతో మాట్లాడుతున్న ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయ బృందం

పామిడి: పట్టణంలోని రైతు భరోసా కేంద్రాన్ని గురువారం ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వ విద్యాలయ బృందం ఆకస్మిక తనిఖీ చేసింది. ఈసందర్భంగా వారు రైతులతో ముఖాముఖీగా మాట్లాడారు. అనంతరం విశ్వవిద్యాయల గౌరవ డైరెక్టర్ డాక్టర్ జీ రఘునాథ్‌రెడ్డి, నోడల్ ఆఫీసర్ హెచ్ శ్రీనివాసరావు సీసీ స్కీమ్‌పై అవగాహన కల్పించారు. దేశంలో వ్యవసాయరంగంలో రోజురోజుకు పెట్టుబడి అధికమవుతున్నాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర కల్పించేందుకు డీఈఎస్, సీఏసీపీ సంయుక్త ఆధ్వర్యంలో ఏపీ ప్రభుత్వం సేద్యపు ఖర్చుల పథకం (సీసీ స్కీమ్) ప్రవేశపెట్టిందన్నారు, కార్యక్రమంలో ఫీల్డ్ సూపర్‌వైజర్లు డాక్టర్ సీహెచ్ సతీష్, ఎం రామకృష్ణ, ఫీల్డ్ ఇన్విస్టిగేటర్ జీ సుబ్బారెడ్డి, రైతులు పీ మహమ్మద్‌ఖాన్, కే రంగస్వామిరెడ్డి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గద్దెదింపుతాం


రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు

తాడిపత్రి: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ చేయకపోతే బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు హెచ్చరించారు. గురువారం తాడిపత్రిలో సీబీ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 29 ఏళ్ల దండోరా ఉద్యమం, మాదిగ అమరవీరుల త్యాగాలు వృథా కానీయమన్నారు. ట్రాఫిక్‌కు అడ్డంకిగా మారడంతో పోలీసులు రాస్తారోకో చేస్తున్న నాయకులు, కార్యకర్తలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో మాదిగ మహాజన సోషలిస్ట్ పార్టీ తాడిపత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెద్దిరాజు, ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు ఆదినారాయణ, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సీబీ రవి, ఎమ్మార్పీఎస్ నాయకులు బాల చంద్రాయుడు, కంబగిరి, వెంకటేష్, రాజారత్నం, బాబయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం


పెద్దవడుగూరు : వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు


పెద్దవంకలో నిమజ్జనం చేస్తున్న దృశ్యం


నార్పల :వినాయక నిమజ్జనంలో పాల్గొన్న మహిళలు, యువకులు

పెద్దవడుగూరు: స్థానిక ఎస్సీ కాలనీలోని 5 వినాయకుడి ప్రతిమలను గురువారం ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం వినాయక ప్రతిమలను ట్రాక్టర్ల పై పెట్టుకొని గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. యువకులు చిందులు వేస్తూ ముందుకు సాగారు. అనంతరం స్థానిక పెద్దవంక లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా సీఐ శంకర్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు నిర్వహించారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

నార్పల: మండల వ్యాప్తంగా గురువారం వినాయకుడి నిమజ్జనం ఘనంగా జరిగింది. స్థానిక పాత పోలీస్‌స్టేషన్ పరిధిలోని వినాయకుడి నిమజ్జనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళలు, యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆటపాటలతో సందడి చేశారు. వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు గవ్వల శ్రీకాంత్ వేలం పాటలో పాల్గొని లడ్డూను దక్కించుకున్నాడు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

రూ.1.90 లక్షలు పలికిన వినాయక లడ్డూ


ఓబిరెడ్డిని సన్మానిస్తున్న బొజ్జ గణపతి యూనియన్ సభ్యులు

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని పుట్లూరు రోడ్డు పెద్దమ్మ గుడి వద్ద బొజ్జ గణపతి యూనియన్ ఆధ్వర్యంలో గణేశుని లడ్డూని గురువారం వేలం నిర్వహించగా రికార్డు ధర పలికింది. పట్టణానికి చెందిన కూరగాయల మార్కెట్‌లోని అక్షయ దుకాణం యజమాని ఓబిరెడ్డి రూ.1,90,000లకు లడ్డూను దక్కించుకున్నారు. శుక్రవారం నిమజ్జనం కార్యక్రమం ఉండడంతో నాల్గవ రోజు గురువారం రాత్రి వేలాది మంది భక్తుల సమక్షంలో వేలం నిర్వహించారు. ఈసందర్భంగా ఓబిరెడ్డిని బొజ్జ గణపతి యూనియన్ సభ్యులు సన్మానించారు.

పామిడి: స్థానిక పెద్ద విఠోబ ఆలయం వద్ద లాల్‌భాగ్‌చా రాజా వినాయక ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో వినాయక లడ్డూకు వేలంపాట నిర్వహించారు. గణేష్ భక్తుడు లకుండే రామచంద్రారావు లడ్డూనూ రూ.16,500కు వేలంలో దక్కించుకున్నారు. ఈసందర్భంగా మండపం వద్ద మధ్యాహ్నం 1200 మందికి అన్నదానం నిర్వహించారు.

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ గంగయ్య

తాడిపత్రి: పట్టణంలో శుక్రవారం జరగనున్న వినాయకుడి నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గురువారం డీఎస్పీ సీఎం గంగయ్య తెలిపారు. తాడిపత్రి పట్టణంతో పాటు గన్నెవారిపల్లి కాలనీల్లో మొత్తం 240 విగ్రహాలు ఏర్పాటయ్యాయన్నారు. పెద్దపప్పూరు మండలం చీమలవాగుపల్లి వద్ద ఉన్న నీటి కుంటల్లో నిమజ్జన ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. నిమజ్జన ప్రదేశం వద్ద 2 క్రేన్లు, 4 జేసీబీలతో పాటు రెండు జనరేటర్లతో విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశామన్నారు. నిర్వాహకులు ఉదయమే విగ్రహాలను ఆయా వాహనాల్లో ఎక్కించి, ప్రధాన రహదారి సీబీ రోడ్డుపైకి వచ్చి చేరాలన్నారు. నిమజ్జన కార్యక్రమం రాత్రి వరకు కొనసాగనున్నందున్న ఎలాంటి అపశృతులు, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తాడిపత్రి పట్టణ, రూరల్, యాడికి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు పోలీసు సిబ్బందితో పాటు, ఆయా సీఐలు, ఎస్‌ఐలు పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు, హోంగార్డులతో కలిపి దాదాపు 250 మంది బందోబస్తులో ఉంటారన్నారు. వినాయక నిమజ్జనానికి అందరూ సహకరించాలని డీఎస్పీ కోరారు.

చోరీ ఘటనలో ఆరోపణలు బాధాకరం

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో హుండీ చోరీ ఘటనలో ఆలయ అధికారులపై నిరాధార ఆరోపణలు బాధాకరమని ఆలయ ఈఓ వెంకటేశ్వరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు గురువారం ఆయన హుండీ చోరీ, పవన్ సెక్యూరిటీ ఏజెన్సీ రద్దు, ఆలయ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల పంపిణీపై ప్రకటన విడుదల చేశారు. ఆలయంలో ఈనెల 17న అభిషేకం సమయంలో కృష్ణారెడ్డి అనే వ్యక్తి హుండీ నగదు చోరీకి పాల్పడిన విషయం ఏఈఓ ధనుంజయ అదేరోజు సాయంత్రం తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. కానీ ఆరోజు వారాంతం సెలవు కావడంతో 18 ఉదయాన్నే ఆలయంలో రాత్రి పూట విధులు నిర్వహించే సిబ్బందిని పిలిపించి విచారించామని, సీసీ ఫుటేజీలను పరిశీలించగా హుండీ నంబర్ 17లో కృష్ణారెడ్డి నగదు చోరీ చేసినట్లు నిర్ధారణ కావడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. చోరీకి పాల్పడిన కృష్ణారెడ్డిని శాశ్వతంగా విధుల నుంచి తొలగించామని తెలిపారు. ఆలయంలో పవన్‌సెక్యూరిటీ ఏజెన్సీ ద్వారా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిర్వహణ జరుగుతుందని, కానీ ఏజెన్సీ కృష్ణారెడ్డి పేరున ఉన్న నేపథ్యంలో ఏజెన్సీని రద్దు చేశామని పేర్కొన్నారు. కొత్త టెండర్‌పై దేవదాయ కమిషనర్ ఆదేశాల వచ్చేంత వరకూ దేవస్థానం తరఫున ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు దినసరి వేతనాలు చెల్లించేందుకు నిర్ణయించామని తెలిపారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల అంతర్గత బదిలీలు, రాత్రిపూట సెక్యూరిటీ, సీసీ కెమెరాల పర్యవేక్షణ తదితర బాధ్యతలను ప్రత్యేక హోంగార్డుకు అప్పజెప్పామని తెలిపారు. అధికారులు, కృష్ణారెడ్డితో రహస్య మంతనాలు జరిపారని, బేరం కుదరని కారణంగా మరుసటి రోజు విచారణ చేపట్టి చోరీ విషయాన్ని బయటపెట్టారని సోషల్ మీడియాలో ప్రచారం చేయడం సరికాదని పేర్కొన్నారు. హుండీ చోరీ విషయంలో సమగ్ర విచారణ జరిపేందుకు పోలీసులకు సంపూర్ణ సహకారం అందజేస్తామని ప్రకటించారు.

గురుకుల పాఠశాలల్లో వాటర్ ప్లాంట్ల ప్రారంభం


మాట్లాడుతున్న న్యాయవాది ప్రతాప్‌రెడ్డి

గుత్తి రూరల్: మండలంలోని రజాపురం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, సేవాగఢ్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో గురువారం వాటర్ల ప్లాంట్లను సాహితి గగన్ మహల్ సంస్థ అధ్యక్షుడు, న్యాయవాది ప్రతాప్‌రెడ్డి ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లతో కలిసి ప్రారంభించారు. రెండు గురుకుల పాఠశాలల్లో తాగునీటి సమస్య అధికంగా ఉండటంతో సాహితి గగన్ మహల్ సంస్థ అధ్యక్షుడు, న్యాయవాది ప్రతాప్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ముంబైలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఈఓ అయిన మఠం వెంకట్రావు దృష్టికి నీటి సమస్యను తీసుకెళ్లారు. స్పందించిన బ్యాంకు సీఈఓ మఠం వెంకట్రావు బ్యాంకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ(సీఎస్ఆర్) స్కీం కింద ఒక్కో గురుకుల పాఠశాలలో 500 లీటర్ల సామర్థ్యం కలిగిన ఆర్ఓ వాటర్ ప్లాంట్లను మంజూరు చేశారు. గురుకులంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన న్యాయవాది ప్రతాప్‌రెడ్డి, మఠం వెంకట్రావులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీఓ మురళీకృష్ణ, సేవాలాల్ ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్, గురుకుల సిబ్బంది పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

గుంతకల్లు రూరల్: వైటీచెరువు గ్రామంలో బుధవారం రాత్రి వినాయకుడి నిమజ్జనం సందర్భంగా జరిగిన గొడవలో ఇరువర్గాలపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. రూరల్ ఎస్‌ఐ సురేష్ వివరాల మేరకు..వినాయకుడి నిమజ్జన జరుగుతుండగా గ్రామానికి చెందిన బెస్త గోపాల్, మస్తాన్ మధ్య చేపల చెరువు విషయమై గొడవకు దిగారు. చేపల చెరువులో తనకు భాగం ఇవ్వాలని మస్తాన్ మాట్లాడగా మీకు ఎటువంటి భాగం లేదని అందుకు తగిన సాక్ష్యాధారాలతో కోర్టు ఆర్డర్ ఇచ్చిందని గోపాల్ గుర్తు చేశాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి చివరికి ఇరువర్గాల దాడికి దారితీసింది. ఘటనలో మస్తాన్‌తోపాటు మరో 8 మందిపై కేసు నమోదు చేయగా, బెస్త గోపాల్ తోపాటు ఆయనతో నిలిచిన మరో 9 మందిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అండర్ -12 మిక్స్‌డ్ జెండర్ క్రికెట్‌కు తాడిపత్రి టీం


అండర్-12 మిక్స్‌డ్ జెండర్ క్రికెట్ టీంకు ఎంపికైన తాడిపత్రి జట్టు సభ్యులు

తాడిపత్రి: ఆర్డీటీ, అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 24 వరకు జరిగే మిక్స్‌డ్ జెండర్ క్రికెట్ టోర్నమెంట్‌కు అండర్ – 12 కు తాడిపత్రి జట్టు ఎంపికైనట్లు ఆర్డీటీ కోచ్ భార్గవ్ గురువారం తెలిపారు. గుత్తి వేదికగా జరిగే ఈ టోర్నీలో కెప్టెన్‌గా బురానుద్దీన్, వైస్ కెప్టెన్‌గా అభిరామ్, సభ్యులుగా జాఫర్, కార్తీక్ అశ్వర్, బలరాం, దినేష్, జయప్రకాష్, రాజ లక్షిత్, సుహాస్, ఇమ్రాన్, తస్లిం, సఫానా, యజ్ఞ, శ్రీలత, కీర్తన, మానస, సృజన, అక్షయ, ఉదయశ్రీ, తస్నీం స్థానం సంపాదించారన్నారు. వీరిని పట్టణ ఎస్‌ఐ ధరణీబాబు, తాడిపత్రి క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ సాదక్ వలి, ఆర్డీటీ ఏటీఎల్ రఘురాం, సూర్య స్కూల్ కరస్పాండెంట్ బాబయ్య, తాడిపత్రి వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

మహిళా బిల్లు ఆమోదంపై సంబరాలు


పీఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళలు

గుంతకల్లుటౌన్: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించడం పట్ల బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. గురువారం మహిళా మోర్చా ఆధ్వర్యంలో మోదినాబాద్ లాల్‌బహదూర్ శాస్త్రిమున్సిపల్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళలకు స్వీట్లు పంచిపెట్టారు. థ్యాంక్యూ మోదీజీ అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ విశ్వనాథ్, మహిళా మోర్చా సోషియల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ విజయలక్ష్మి మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం చరిత్రాత్మక ఘట్టమన్నారు. మహిళల అభివృద్ధి, సంక్షేమానికి మోదీ సర్కారు అనునిత్యం కృషి చేస్తోందన్నారు. పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని చేతివృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మావతి, పార్టీ నాయకులు మహేష్, గుర్రం సూర్యనారాయణ, వడ్డే రమేష్, జెరాల్డ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి


వేరుశనగ పంటను పరిశీలించి రైతులకు సలహాలిస్తున్న డీపీఎం లక్ష్మానాయక్

గుంతకల్లు రూరల్: ప్రకృతి వ్యవసాయంలో లాభదాయక పంటలపై రైతులు అవగాహన పెంచుకోవాలని డీపీఎం లక్ష్మానాయక్ రైతులకు సూచించారు. గురువారం గుండాల, గుండాల తండా గ్రామాలలో సిబ్బందితో కలిసి ప్రకృతి వ్యవసాయం కింద సాగుచేసిన పంటలను పరిశీలించారు. వర్షాభావం కారణంగా బీడుగా ఉన్న భూముల్లో డ్రాట్ ప్రూఫింగ్ విధానంలో కంది, ఆముదం, అలసంద, అనుములు, గోరు చిక్కుడు, సజ్జ పంటలను ఘన జీవామృతంతో కలిపి విత్తనం వేసుకోవాలని సూచించారు. ఇళ్ల దగ్గర ఉన్న ఖాళీ స్థలంలో కిచెన్ గార్డెన్‌లో 15 రకాల విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్ధి చేసి ఘన జీవామృతంతో సాగుచేసుకోవాలన్నారు.

బుక్కరాయసముద్రం: ప్రభుత్వం పథకాలను రైతులకు సక్రమంగా అందించాలని ఎంపీపీ సునీత పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొట్టాలపల్లిలో జిల్లా పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సునీత మాట్లాడుతూ రైతులు పట్టు పరిశ్రమపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పట్టు సాగుకు ప్రభుత్వం షెడ్లు, పట్టు పురుగుల పెంపకానికి ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో బీకేఎస్ మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి, జిల్లా సెరికల్చర్ అధికారి ఆంజనేయులు, ఓబిలేసు, సచివాలయ సిబ్బంది, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ఔషధ ప్రతి చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

• సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు

అనంతపురం మెడికల్: ఔషధ ప్రతి చర్యలతో ఎదురయ్యే దుష్పరిణామాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం సర్వజనాస్పత్రిలోని మెడిసిన్ విభాగంలో ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో 3వ జాతీయ ఫార్మకో విజిలెన్స్ వీక్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ మనం వాడే మందుల ద్వారా ఏమైనా ప్రతికూల చర్యలు (రియాక్షన్స్) ఉంటే వెంటనే ఆస్పత్రుల్లో వైద్యులను సంప్రదించాలన్నారు. దీంతో పాటుగా టోల్ ఫ్రీ నంబర్ 1800 180 3024కు ఫోన్ చేస్తే నివారణ చర్యలు తెలియజేస్తారన్నారు. భారత దేశ కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించేందుకు ప్రతికూల ఔషధ ప్రతిచర్య పర్యవేక్షణ కార్యక్రమాలను చేపడుతోందన్నారు. కార్యక్రమంలో మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ భీమసేనాచార్, ప్రొఫెసర్ డాక్టర్ వేముల శ్రీనివాసులు, ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ షారోన్ సోనియా, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యాడికి: ఈ నెల 13న తిరునాంపల్లె గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన తమిళనాడు రాష్ట్రానికి చెందిన జేవీయర్‌కు మృతి చెందాడు. ఎస్‌ఐ గురు ప్రసాద్ రెడ్డి, మృతుడి భార్య వాసంతి తెలిపిన వివరాలు.. తమిళనాడు రాష్ట్రం కాంచీపురం జిల్లా, పల్లవరం గ్రామానికి చెందిన ఎంఆర్ జేవియర్ (52) కారు డ్రైవర్‌గా పని చేసేవాడు. చెన్నయ్‌కు చెందిన శ్రీనివాసులు, గోవిందరాజులు, జయలక్ష్మి, ఉషారాణి కుటుంబ సభ్యులతో టీఎన్ 11ఏసీ0529 నంబరు గల కారులో ఈ నెల 13న యాడికి మండలం మీదుగా కర్నూలు జిల్లా ఆదోనికి బయలుదేరారు. తినురాంపల్లె సమీపంలో ముందు పోతున్న బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో కారు ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొంది. కారు డ్రైవర్‌తో పాటు కారులోని నలుగురు వ్యక్తులకు గాయాలు కావటంతో అనంతపురం సవీరా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి క్షతగాత్రులను వారి కుటుంబ సభ్యులు ఈ నెల 15న తమిళనాడులోని రాజీవ్‌గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో జేవియర్ బుధవారం రాత్రి మృతి చెందారు. సమాచారం అందుకున్న యాడికి ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, పోలీసు చాందుబాషా గురువారం తమిళనాడుకు వెళ్లారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

గుత్తి రూరల్: కొజ్జేపల్లి గ్రామ శివారులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడి తీవ్రంగా గాయపడిన టి.కొత్తపల్లి గ్రామానికి చెందిన వంశీ(21) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వంశీ అనే యువకుడు గ్రామంలో వినాయక చవితిని పురస్కరించుకొని విగ్రహం తెచ్చేందుకు ఈ నెల 17న బైక్‌పై గుంతకల్లుకు వెళ్లాడు. అక్కడ కొనుగోలు చేసిన అనంతరం విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఎత్తి వెనకాల బైక్పై వస్తుండగా కొజ్జేపల్లి గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన వంశీని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు కర్నూలుకు తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో అక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హుండీ చోరీపై విచారణ జరిపించాలి

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో జరిగిన హుండీ చోరీ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ నాయకులతో కలిసి గురువారం ఆలయాన్ని సందర్శించిన ఆయన చోరీ జరిగిన హుండీని పరిశీలించి అనంతరం ఈఓతో మాట్లాడారు. 6 నెలల నుంచి హుండీ నగదు చోరీ జరుగుతున్నట్లు పాలకమండలి సభ్యుడు చెప్పారని, దొంగతనాలు జరుగుతుంటే ఆలయ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

కూలీల హాజరు శాతం పెంచాలి

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా ఉపాధి పనుల్లో కూలీల హాజరు శాతం పెంచాలని ఏపీఓ నాంచారమ్మ సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ జాబ్ కార్డు ఉండి ఉపాధి పనులు అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలన్నారు. పనులు నాణ్యతతో చేయించాలన్నారు. కొలతల ప్రకారం పనులు చేసిన వారందరికీ గిట్టుబాటు కూలీ కల్పించాలని సూచించారు.

ఘనంగా గురజాడ అప్పారావు జయంతి

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో గురువారం గురజాడ అప్పారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్లు గురజాడ అప్పారావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అబూ బకర్, కుల్లాయప్ప, సభ్యులు పాల్గొన్నారు.

బండగేరిలో ఘర్షణ

గుత్తి: పట్టణంలోని బండగేరిలో బుధవారం రాత్రి వినాయక నిమజ్జనం విషయంలో ఘర్షణకు దిగిన ఇరు వర్గాలకు చెందిన సుమారు 30 మందిని గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు... చాకలి వీధి, బెస్త వీధికి చెందిన వారు వినాయకున్ని నిమజ్జనం చేయడానికి ట్రాక్టర్లో తీసుకొచ్చి బండగేరిలో ఉంచారు. చాలా సమయం పాటు విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించకుండా అక్కడ ఉంచడంతో బండగేరి వాసులు ప్రశ్నించారు. దీంతో చాకలి గేరి, బండగేరి వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇరువర్గాలకు చెందిన ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కొందరు స్వల్పంగా గాయపడ్డారు. ఇరువర్గాలు పోలీసులకు పరస్పరం ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఇన్‌చార్జ్ సీఐ రాజశేఖరరెడ్డి ఇరు వర్గాలకు చెందిన సుమారు 30 మందిని అదుపులోకి తీసుకుని విచారించారు.

వాహనాల్లో డీజిల్ చోరీ

గుత్తి: పట్టణ శివారులోని కర్నూలు రోడ్డులో హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద పార్కింగ్ చేసిన మూడు ఐచర్ వాహనాలు, మరో రెండు లారీల్లోని డీజిల్ ట్యాంక్‌లోని డీజిల్‌ను గుర్తు తెలియని దొంగలు చోరీ చేసి కెళ్లారు. వివరాల్లోకి వెళితే.. శివ, మాబు మరో ముగ్గురు డ్రైవర్లు మూడు ఐచర్లు, రెండు లారీలను హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద బుధవారం రాత్రి పార్కింగ్ చేసి నిద్రించారు. అయితే అర్ధరాత్రి తర్వాత దొంగలు డీజిల్ ట్యాంక్‌ల మూతలను ధ్వంసం చేసి డీజిల్‌ను దొంగలించారు. సుమారు వెయ్యి లీటర్ల దాకా డీజిల్ చోరీకి గురైనట్లు బాధిత డ్రైవర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ జరిగిన ప్రాంతాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

24న వైద్య శిబిరం

గుంతకల్లుటౌన్: రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 24న రోటరీ హైస్కూల్‌లో ఉచిత మెగా కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, శివానంద గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కర్నూలు సన్‌షైన్ ఆస్పత్రి వైద్యులు సేవలందిస్తారని పేర్కొన్నారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా శస్త్రచికిత్సలు జరిపిస్తామని తెలిపారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

తాడిపత్రి: పట్టణంలోని మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఫయాజ్‌బాషా ట్రస్ట్ వ్యవస్థాపకుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత హీరాపురం ఫయాజ్‌బాషా తెలిపారు. శిబిరంలో అనంతపురం సవీరా ఆస్పత్రి వైద్యులు జీఆర్‌బీఎస్, బీపీ, ఈసీజీ, 2 డీఏకో తదితర పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పట్టణ ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు బొలికొండ రంగనాథస్వామి ఆలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కిస్తున్నట్లు ఆలయ ఈఓ దేవదాసు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని పేర్కొన్నారు.

జూదరుల అరెస్టు

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని ఓంశాంతి నగర్‌లో గురువారం పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు. నిందితుల నుంచి రూ.24,480 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు


బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న టూటౌన్ ఎస్‌ఐ రాఘువేంద్రరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ రమాదేవి

అనంతపురం క్రైం: స్థానిక ప్రకాష్‌రోడ్డులో మూడేళ్ల బాలుడు ఏడుస్తూ టూటౌన్ హెడ్‌కానిస్టేబుల్ రమాదేవి కంటపడ్డాడు. బాలుడిని ఆమె స్టేషన్‌కు తీసుకెళ్లి, విషయాన్ని పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు బాలుడి ఆచూకీ కోసం ఆరా తీశారు. స్థానిక రహమత్‌నగర్‌కు చెందిన జబ్బార్ కుమారుడు అని తెలుసుకుని, బాలుడి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించారు. హెడ్‌కానిస్టేబుల్ రమాదేవిని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అభినందించారు.